PRABHATA GAMANAM
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 315 మంగళవారం 25 - 08 - 2026 ఎడిటర్ : రవిచంద్ర పేజిలు : 8 వెల : 4

## రూ.కోట్ల విలువైన 2025-26 ఖరీఫ్,రబీ

# ధాన్యం మాయం...



- దమ్ముంటే పట్టుకొండీ అంటూ అధికారులకే మిల్లర్ల సవాల్....
- విజిలెన్స్ అధికారులు తనిఖీలు తూతూమంత్రం...!
- నిద్రమత్తులో యంత్రాంగం.. పత్తాలేని సివిల్ సప్లైస్ కమిషనర్...!
- మిల్లులపై 'పీడీ యాక్ట్'లు ఏవి?.. జిల్లా అధికారుల ఉదాసీనతపై సర్వత్రా నిరసన....
- తక్షణమే జోక్యం చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రికి ప్రజల విజ్ఞప్తి!






కేసముద్రం, ఆగస్టు 7 (ప్రభాత గమనం): ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతులకు మద్దతు ధర ఇచ్చి సేకరించిన ధాన్యం మిల్లులకు చేరాక రెక్కలొచ్చి ఎగిరిపోతోంది.కేసముద్రం మండలంలో కోట్లాది రూపాయల విలువైన(2025-26) ఖరీఫ్, రబీ సీజన్ల కస్టమ్ మిల్లింగ్ రైస్ ధాన్యం పక్కదారి పట్టినా.. సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు మాత్రం 'ఏమీ ఎరుగనట్లు' వ్యవహరిస్తున్నారు.ఇటీవల కేసముద్రం లోని పలు మిల్లులపై జరిపిన విజిలెన్స్ అధికారుల తనిఖీలు కేవలం 'కాగితాల పరిమితం'గా, 'తూతూమంత్రం'గా మారాయనే తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికి బియ్యం రూపంలో అందించాల్సిన కొందరు మిల్లు యజమానులు, అధికారుల అండదండలతో ఆ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో విక్రయించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.మేము ధాన్యాన్ని బరాబర్ అమ్ముకుంటాం మమ్మల్ని ఆపేదెవరూ అంటూ మిల్లర్లు నక్క గాంభీర్యాలు పెడుతున్నారు.2025-26 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లుల గోదాముల్లో ఉండాల్సింది పోయి.. వ్యాపారుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. లెక్కల్లో మాత్రం ధాన్యం ఉన్నట్లు చూపిస్తూ, క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తే అధికారుల నోళ్లు మూయిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.ఇంత జరుగుతున్నా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. తనిఖీల పేరిట మిల్లుల వద్దకు రావడం, 'చాయ్--బిస్కెట్' మర్యాదలు స్వీకరించి, ఏదో ఒక చిన్న సాంకేతిక లోపాన్ని చూపిస్తూ మమ అనిపించడం పరిపాటిగా మారింది. అసలు గోదాముల్లో ఎంత ధాన్యం ఉండాలి? ఎంత ఉంది? అనే ప్రాథమిక లెక్కలను కూడా సరిగ్గా తనిఖీ చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.ప్రభుత్వ ధాన్యాన్ని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన రైస్ మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవడంలో యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. పక్కదారి పట్టించిన రైస్ మిల్లుల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు, సదరు నిర్వాహకులపై 'పీడీ యాక్ట్' నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హెచ్చరికలు కేవలం పేపర్ ప్రకటనలకే పరిమితమయ్యాయా? అని ప్రశ్నిస్తున్నారు.జిల్లా స్థాయిలో సివిల్ సప్లైస్ అధికారులు, డీఎస్ఓలు, తహశీల్దార్లు మిల్లుల అక్రమాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. కేసముద్రం మండలంలో క్షేత్రస్థాయిలో ఇంతటి భారీ కుంభకోణం జరుగుతున్నా.. రాష్ట్రీయ పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్పందించకపోవడం, అసలు ఈ వ్యవహారంపై ఆయన జాడే లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కనీసం జిల్లా అధికారుల నిర్లక్ష్యంపైనా, లోపాయికారీ ఒప్పందాలపైనా శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోలేకపోతున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.లక్షలాది మంది పేదల పొట్ట నింపేందుకు, రైతులను ఆదుకునేందుకు కేటాయించిన ధాన్యం అక్రమార్కుల పాలువుతుంటే చూస్తూ ఊరుకోవడం తగదని ప్రజా సంఘాలు, పౌరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తక్షణమే రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్యేకంగా జోక్యం చేసుకోవాలని కేసముద్రం మండల ప్రజలు కోరుతున్నారు. కొందరు దొంగ మిల్లర్లకు అధికార పార్టీ పెద్ద లీడర్లు కొమ్ముకాస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కేసముద్రంలో జరుగుతున్న ఈ దందా పై దృష్టి పెట్టి హైదరాబాద్ నుండి ప్రత్యేక బృందాలను పంపి ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమాలకు పాల్పడిన రైస్ మిల్లుల నిర్వాహకులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని,నిర్లక్ష్యంగా వ్యవహరించిన జిల్లా స్థాయి పౌరసరఫరాల అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మేధావులు అంటున్నారు.ఒక ప్రత్యేక ఉన్నత స్థాయి కమిటీని వేసి మిల్లుల్లో సమగ్ర 'స్టాక్ వెరిఫికేషన్' చేపట్టి, ప్రభుత్వ ఆస్తిని రికవరీ చేయాలని సగటు పౌరుడు గగ్గోలు పెడుతున్నాడు.మరి ఇప్పటికైనా పౌరసరఫరాల శాఖ మంత్రి, కమిషనర్ స్పందించి అక్రమార్కుల గుట్టు రట్టు చేస్తారో.. లేక ఈ దందాను ఇలాగే కొనసాగనిస్తారో వేచి చూడాల్సిందే...!

## జాటోత్ లచ్చిరాం నాయక్ పార్థివదేహానికి నివాళులు

కేసముద్రం, ఆగస్టు 23 (ప్రభాత గమనం): కేసముద్రం మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు జాటోత్ హరీష్ నాయక్ తండ్రి, కేసముద్రం మున్సిపాలిటీ 1వ వార్డు కౌన్సిలర్ జాటోత్ సుజాత మామ జాటోత్ లచ్చిరాం నాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏఎంసీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కేసముద్రం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆదివారం ఆయన స్వగ్రామానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా లచ్చిరాం నాయక్ మృతి పట్ల వారు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వరరావు, నీలం దుర్గేష్, రావుల మురళి, గుజ్జునూరి బాబురావుతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## శిక్షణ పేరిట 'భక్షణ'

- వార్డు సభ్యుల కడుపు మార్చి లక్షలు నొక్కేశారు!
- రూ. 2.34 లక్షల ప్రజాధనం స్వాహా.. నెక్కొండ ఎంపీడీవో ఆఫీసులో నిధుల జాతర
- 3 రోజులు భోజనమూ పెట్టలే.. కాగితాల్లో మాత్రం ఫుల్ బిల్లులు డ్రా!
- సొంత డబ్బులు పెట్టిన సర్పంచులు, శిక్షకులకు పంగనామాలు
- "నన్నేం చేయలేరు" అంటూ అధికారి సవాల్.. ఉన్నతాధికారుల అండపై అనుమానాలు

నెక్కొండ, ఆగస్టు 23 (ప్రభాత గమనం): మండల పరిషత్ కార్యాలయం వేదికగా ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించాల్సిన అధికార యంత్రాంగం.. అవినీతి పాఠాలు వండి వారుస్తోంది. నెక్కొండ మండలంలో వార్డు సభ్యుల శిక్షణ పేరిట జరిగిన నిధుల దోపిడీ పర్వం ఇప్పుడు స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ప్రభుత్వం కేటాయించిన రూ. 2.34 లక్షల ప్రజాధనాన్ని అడ్డగోలుగా నొక్కేసిన అధికారులు, ఇప్పుడు ఆ పాపాన్ని కప్పిపుచ్చుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు.మండలంలోని 39 గ్రామ పంచాయతీలకు చెందిన వార్డు సభ్యులకు 15 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. అయితే, చివరి విడతకు వచ్చేసరికి అధికారుల ఆగడాలు పరాకాష్టకు చేరాయి. చివరి 3 రోజులు వార్డు సభ్యులకు కనీసం భోజనం కూడా పెట్టకుండా వారి కడుపు మార్చారు. తీరా రికార్డుల్లో మాత్రం పూర్తి స్థాయిలో భోజనాలు వడ్డించినట్లు చూపి, రూ. 2.34 లక్షల బిల్లులను బొక్కేసి జేబులు నింపుకున్నారు.ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా అధికారులు పైసా విదల్చకపోవడంతో, ఊరి పరువు పోకూడదని భావించిన




సర్పంచులు తమ సొంత డబ్బులు ఖర్చు చేసి కార్యక్రమాలు నడిపించారు. ఒక్క దీక్షకుంట సర్పంచే ఏకంగా రూ. 30 వేలు తన జేబు నుండి వెచ్చించారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. శిక్షణ ముగిసినా సర్పంచులకు రూపాయి చెల్లించలేదు సరే సరి.. రాత్రింబవళ్లు పాఠాలు చెప్పిన ట్రైనర్లకు ఇవ్వాల్సిన బకాయిలను సైతం అధికారులు మింగేశారు.ఇంత రచ్చ జరుగుతున్నా సదరు బాధ్యతారాహిత్య అధికారి "నన్నెవరూ ఏమీ చేయలేరు" అంటూ బహిరంగంగానే సవాళ్లు విసురుతుండటం గమనార్హం. మరో అధికారి ఆయనకు వంత పాడుతుండటంతో ఈ దోపిడీలో ఎవరెవరికి ఎంతెంత వాటాలు ముట్టాయనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా అధికారులు సైతం ఈ వ్యవహారంపై స్పందించకపోవడం వెనుక ఉన్న అసలు మతలబు ఏంటని మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు నిలదీస్తున్నారు.ప్రజాధనాన్ని కాజేసి, వార్డు సభ్యులను మోసం చేసిన బాధ్యులపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని స్థానిక ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. కాజేసిన రూ. 2.34 లక్షల సొమ్మును వారి నుంచి రికవరీ చేయడంతో పాటు, అవినీతికి పాల్పడిన అధికారులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## యువత చూపు టీఆర్పీ వైపు....

- మేడిపల్లి టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు షాక్....
- తెలంగాణ రాజ్యాధికార పార్టీలో భారీగా యువత చేరిక....
- పార్టీ రాష్ట్ర నాయకులు పిట్టల శంకర్ ఆధ్వర్యంలో చేరికలు.....
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న....

హైదరాబాద్ ఆగస్టు 24(ప్రభాత గమనం): తెలంగాణలో యువత రాజకీయ మార్పును కోరుకుంటూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) వైపు పెద్ద ఎత్తున ఆకర్షితులవుతోందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. మేడిపల్లి ప్రాంతానికి చెందిన పలువురు యువ నాయకులు, కార్యకర్తలు టిఆర్ఎస్ మరియు కాంగ్రెస్ పార్టీలకు రాజీనామా చేసి తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు.పార్టీ రాష్ట్ర నాయకులు పిట్టల శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మోతె మల్లేశం, ఉపేందర్,సాయిలతో పాటు యువత భారీ సంఖ్యలో టీఆర్పీలో చేరారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కొత్తగా పార్టీలో చేరిన యువతకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. తెలంగాణలో సామాజిక న్యాయం, బీసీలకు రాజ్యాధికారం, యువతకు ఉపాధి అవకాశాలు, నాణ్యమైన విద్య, పారదర్శక పాలన కోసం టీఆర్పీ పోరాడుతోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చగల శక్తి యువతలోనే ఉందని, యువత రాజకీయాల్లో చైతన్యవంతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.పార్టీ సిద్ధాంతాలు, తీన్మార్ మల్లన్న నాయకత్వం, బీసీ రాజ్యాధికార లక్ష్యాలు తమను ఆకర్షించాయని కొత్తగా చేరిన యువ నాయకులు తెలిపారు. తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా టీఆర్పీ ఎదుగుతోందని, రానున్న రోజుల్లో మరింత మంది యువత పార్టీ వైపు వస్తారని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు,యువజన ప్రతినిధులు పాల్గొన్నారు.




## డోర్నకల్ 'మెపా' మండల అధ్యక్షుడిగా మారబోయిన నవీన్ కుమార్ ముదిరాజ్

### ముదిరాజ్‌ల ఐక్యత, సమస్యల సాధనేలక్ష్యం: నూతన అధ్యక్షుడు

### రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు



డోర్నకల్ ఆగస్టు 23 (ప్రభాత గమనం): ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) డోర్నకల్ మండల అధ్యక్షుడిగా స్థానిక సీనియర్ జర్నలిస్ట్ మారబోయిన నవీన్ కుమార్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు 'మెపా' వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ఆయనను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.?ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన నవీన్ కుమార్ ముదిరాజ్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్ప గించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలి పారు. మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ఆశయాలు, ఆలో చన విధానం నచ్చబడే తాము వారి అడుగుజాడల్లో నడుస్తు న్నామని పేర్కొ న్నారు. మండల పరిధిలోని ముదిరాజ్ సమాజ సమస్యల పరిష్కారానికి, జాతి సంక్షేమం మరియు ఐక్యత కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. తన నియామకానికి సహకరించిన కురవి మండల అధ్యక్షుడు పొన్నెబోయిన వెంకన్న ముదిరాజ్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు దుండి అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్యలకు నవీన్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## దేశవ్యాప్తంగా ఉన్న జర్నలిస్ట్ లకు సుప్రీం కోర్ట్ గుడ్ న్యూస్..



హైదరాబాద్ ఆగస్టు 24(ప్రభాత గమనం): పెన్ను పట్టిన,వీడియో కెమెరా పట్టి తమ విధులు రోజు వారి వార్త, న్యూస్ ప్రసారాలు నిర్వహిస్తున్నా వారందరు జర్మలిస్టులే..ఇకపై కావాలనే కక్ష్య తో రాజకీయ నాయకులు, అక్రమ సంపాదన దందాలు చేసే వారు, వివిధ ప్రభుత్వ శాఖల్లో అవినీతి అక్రమాలకు పాల్పడే వాళ్ళ బాగోతలపై నిజాలను నిర్భయంగా వార్త రాసిన, న్యూస్ ప్రసారాలు చేసిన జర్నలిస్ట్ లపై అక్రమ కేసులు చెల్లనేరవని భారత సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.శాటిలైట్ ఛానెల్స్, యూట్యూబ్ న్యూస్ ఛానెల్స్, ప్రింట్ మీడియా సంస్థల్లో పని చేసే జర్నలిస్ట్ లు ఆయా సంఘాల్లో సభ్యత్వం ఉన్న వారు అక్రమ కేసుల లేక నిజ నిరూపణ కేసుల అనేది ఆయా సంఘాల ద్వారా పరిష్కారం కొరకు 7రోజుల్లో నిర్ణయం తీసుకున్నే హక్కులు జర్నలిస్ట్ సంఘాలకే ఉంటుందని, వాళ్ళను కాదని అక్రమ కేసులు పెట్టిన వాళ్ళపై, అట్టి పోలీస్ లపై వేట తప్పదని హెచ్చరించిన సుప్రీం కోర్ట్..

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి....

- సర్పంచ్ ఏర్పుల సునీత కుమారస్వామి.....

కేసముద్రం ఆగస్టు 24(ప్రభాత గమనం): మండలంలోని ఉప్పర పల్లి గ్రామ పంచాయతీ నందు గ్రామ సర్పంచ్ ఏర్పుల సునీత కుమారస్వామి ఆధ్వర్యంలో మొక్కలు నాటడం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవ జాతికి పిల్చడానికి అతి ముఖ్యమైన వాయువు ఆక్సిజన్ కావాలంటే చెట్లను విరివిగా నాటాలని ప్రస్తుత ఎల్ ని వో ప్రభావం వల్ల వర్షాలు రావడం లేదు అడవులను పెంచడం వల్ల ఉష్ణోగ్రతల తగ్గి వర్షాలు పడతాయని రానున్న తరాలకు ఆస్తులతో పాటు అడవులను వృక్షజాతిని అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆవుల ఐలయ్య ,వార్డు సభ్యులు జెనిగల అనిల్ కుమార్,కంచ రాజు కుమార్, తండ సంపత్ కుమార్,మంద ప్రవీణ్, టెక్నికల్ అసిస్టెంట్ మధు బాబు,ఫీల్డ్ అసిస్టెంట్ మంచాల కుమార్,వి బి జి రామ్ కూలీలు పాల్గొన్నారు.



## లచ్చిరాంకు నివాళులర్పించిన మాజీ మార్కెట్ చైర్మన్ మర్రి నారాయణ రావు పరామర్శ..




కేసముద్రం ఆగస్టు 24(ప్రభాత గమనం): బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు జాటోత్ హరీష్ నాయక్ తండ్రి లచ్చిరాం ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో సోమవారం నాడు విషయం తెలుసుకున్న మాజీ మార్కెట్ చైర్మన్ మర్రినారాయణరావు లచ్చిరాం చిత్రపటానికి పూలమాలవేసినివాళులర్పించారు. జాటోత్ హరినాయక్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.లచ్చిరాం మరణం ఈ కుటుంబానికి తీరని లోటని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మర్రి నారాయణరావు వెంట గుగులోతు వీరు నాయక్, బీజూ పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

# ఫీజు బకాయిలు విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం...

**– బీజేపీ కేసముద్రం మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్...**

**– కేసముద్రం మండల కేంద్రంలో బీజేపీ నిరసన ర్యాలీ...**

**– తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పణ....**



కేసముద్రం 24 ఆగస్టు(ప్రభాత గమనం): తెలంగాణ రాష్ట్రంలో నిలిచిపోయిన రూ. 15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కేసముద్రం మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బీజేపీ కేసముద్రం మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరి వల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని మండిపడ్డారు. విద్యార్థుల హక్కుల కోసం, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు కేసముద్రం మండల శాఖ తరపున సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫీజు బకాయిలను విడుదల చేయకపోతే, విద్యార్థుల పక్షాన బీజేపీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోగోజు నాగేశ్వర చారి, వంగాల కొమ్మాల్ రెడ్డి, లెంకలపల్లి శ్రీనివాస్, గాంధీ వెంకట్ రెడ్డి, మహమ్మద్ ఖాసిం, జుజ్జూరు వీరభద్ర చారి, బానోత్ రాము, బానోత్ సంపత్, వల్లందాస్ నగేష్, మండల, గ్రామ కమిటీల బాధ్యులు, శక్తి కేంద్రాల ఇన్చార్జ్‌లు, అనుబంధ మోర్చాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్‌జీఎఫ్ఐ జోన్ క్రీడలకు సమష్టి సహకారం....



కేసముద్రం ఆగస్టు 24(ప్రభాత గమనం): ఎస్‌జీఎఫ్ఐ నెల్లికుదురు జోన్ కోఆర్డినేషన్ సమావేశం సోమవారం కేసముద్రం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో నిర్వహించారు. కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు మండలాలకు చెందిన క్రీడా ఉపాధ్యాయులు సమావేశంలో పాల్గొన్నారు.కేసముద్రం మండల ఎంఈఓ కాలేరు యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశానికి నెల్లికుదురు ఎంఈఓ రాందాస్, ఇనుగుర్తి ఎంఈఓ వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలేరు యాదగిరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందని, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు నాణ్యమైన క్రీడా శిక్షణ అందించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.మూడు మండలాల్లో మండల స్థాయి నిర్వహించుకోవాలి., అనంతరం మండల స్థాయిలో ఎంపికైన వారు జోనల్ స్థాయి ఆడుతారు. ఈ క్రీడలను అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించాలని ఎంఈఓలు కోరారు.ఈకార్యక్రమంలో పీఈటీలు, పీడీలు కొమ్ము రాజేందర్, కొప్పుల శంకర్, నెల్లికుదురు జోన్ సెక్రెటరీ దామల్ల విజయచందర్, సీహెచ్ ఐలయ్య, ఎండీ ఇమామ్, ప్రణయ్, రవి, పద్మ, లలిత, మధు తదితరులు పాల్గొన్నారు.



# కొత్త పోచారంలో ఘనంగా మున్నూరు కాపుల వనభోజనాలు

గార్ల,ఆగస్టు 24 (ప్రభాత గమనం): సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు పచ్చగా విలసిల్లాలని ఆకాంక్షిస్తూ గార్ల మండల పరిధిలోని కొత్త పోచారం గ్రామంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సోమవారం వనభోజన మహోత్సవం కంటికింపుగా సాగింది. గ్రామంలోని మున్నూరు కాపు కులస్తులంతా ఒక్కటై సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన ఈ కార్యక్రమంతో ఊరంతా పండుగ వాతావరణం నెలకొంది.?ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ రమ్య నాగార్జున, మున్నూరు కాపు మండల అధ్యక్షుడు నరెడ్ల సోమయ్య, బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...... వనభోజనాలు కేవలం విందులకు మాత్రమే పరిమితం కాకుండా, కులస్తుల మధ్య ఐక్యతను, ఆత్మీయ అనుబంధాలను పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. మన సంప్రదాయాలను, సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వరుణదేవుని దయతో వర్షాలు బాగా కురిసి రైతులకు మంచి దిగుబడులు రావలని, గ్రామస్థులంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు.కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులను మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం కులస్తులంతా కలసి సామూహికంగా వనభోజనాలు ఆరగించారు. యువకులు, పిల్లలు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు చౌటం నరేష్, గంధం రవి, పసుపులేటి కొండల్ రావు, సుజిత్ నాగార్జున్, తూము మాధవరావు, పింగిలి గణేష్, ముత్యాల రమేష్, ఉపేందర్, ప్రదీప్, ఉమేష్, పోలిశెట్టి శివ, శ్రీను, గంగారపు భాస్కర్, గణేష్, భరత్, సుంకర సైదులు, శ్రీను, తాటికొండ వెంకటేశ్వర్లు, పూర్ణ, మల్లిశెట్టి లక్ష్మీనారాయణతో పాటు పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐ పేరుతో సైబర్ మోసం.. రూ.78వేల టోకరా.

మహబూబాబాద్ ఆగస్టు 24(ప్రభాత గమనం): మహబూబాబాద్ జిల్లాలోని నెల్లికుదురులో ఎస్సై పేరుతో సైబర్ కేటుగాళ్లు వైన్స్ ఉద్యోగి నుంచి రూ.78,500 కాజేశారు. కేసముద్రంకు చెందిన ఓ వ్యక్తికి ఫోన్ చేసిన వ్యక్తి తాను ఎస్సైగా పరిచయం చేసుకొని, తన డ్రైవర్ రూ.25 వేలు నగదు ఇచ్చేందుకు వస్తున్నాడని, అందుకు బదులుగా క్యూఆర్ కోడ్ కు డబ్బులు పంపాలని చెప్పాడు. నమ్మిన అతను రెండు రోజుల్లో రూ.78,500 పంపాడు. మోసాన్ని గుర్తించి 1930కు ఫిర్యాదు చేశాడు

# ప్రజావాణి వినతుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి....

**– రెవెన్యూ,అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్....**



మహబూబాబాద్ ఆగస్ట్24(ప్రభాత గమనం): కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కె. అనిల్ కుమార్ అన్నారు. సోమవారం నాడు ఇన్చార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల ఇంచార్జ్) పురుషోత్తం, జిల్లా రెవెన్యూ అధికారిని నాగలక్ష్మి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు లు ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు.జిల్లాలోని వివిధ మండలాల నుండి విచ్చేసిన బాధితులు, రైతులు, గ్రామస్తులు వినతులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.భూ సమస్యలు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, సర్వే, ధరణి సవరణలకు సంబంధించిన వినతులు అధికంగా వచ్చాయి. గ్రామ పంచాయతీ, పురపాలక, పింఛన్లు, ఉపాధి హామీ మరియు ఇతర సంక్షేమ పథకాలకు సంబంధించిన వినతులు నమోదు అయ్యాయి.కురవి మండలం నారాయణపురం గ్రామ శివారు దారావత్ తండ కు చెందిన ధరావత్ రవి రికార్డు పరంగా తన భూమి పట్టా చేసి ఇవ్వగలరని కోరారు.గూడూరు మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు కు సంబంధించిన డబ్బులు త్వరగా ఇప్పించాలని కోరారు. ప్రజావాణికి వచ్చిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా భావించి, సంబంధిత శాఖాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాలలో ఈ రోజు నిర్వహించిన ప్రజవాణి కార్యక్రమంలో ( 178 ) దరఖాస్తులు వచ్చిన వినతులను వివిధ శాఖల అధికారులకు పరిష్కారం కొరకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం నాయకుడు, రైతు ఉద్యమ నేత సారంపల్లి మల్లారెడ్డికి ఘన నివాళి

**– నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు పోరాడిన యోధుడు**

**– రైతాంగానికి, కార్మికులకు తీరని లోటు: కందునూరి శ్రీనివాస్, గడ్డిపాటి రాజారావు**



– గార్ల, ఆగస్టు 24 (ప్రభాత గమనం) :

నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు ప్రజలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం పోరాడిన నిస్వార్థ పోరాట యోధుడు సారంపల్లి మల్లారెడ్డి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, రైతు సంఘం మండల అధ్యక్షుడు గడ్డిపాటి రాజారావు కొనియాడారు.?సారంపల్లి మల్లారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక మంగపతిరావు భవనంలో సిపిఎం, తెలంగాణ రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆయన సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.?ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో కందునూరి శ్రీనివాస్, గడ్డిపాటి రాజారావులు మాట్లాడుతూ... దేశానికి వెన్నెముకగా నిలిచిన రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై మల్లారెడ్డి సాగించిన పోరాటాలు మరవరానివని గుర్తుచేశారు. రైతు, కార్మిక సమస్యలపై ఆయన చూపిన చొరవ, నిబద్ధత అభినందనీయమని, ఆయన భౌతికంగా దూరమవ్వడం ప్రజా ఉద్యమాలకు, రైతాంగానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన చూపిన బాటలోనే నడుస్తూ, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను ఉధృతం చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.?ఈ సంతాప కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, సిపిఎం మరియు రైతు సంఘాల ముఖ్య నాయకులు ఎం. నాగమణి, కె. ఈశ్వర్ లింగం, కె. రామకృష్ణ, ఎస్.కె. మౌలానా, కె. మహేశ్వరరావు, జి. వీరభద్రం, ఎస్.కే. బాజీ, టి. నాగేశ్వరరావు, కోటయ్య తదితరులు పాల్గొని మల్లారెడ్డికి అంజలి ఘటించారు.

# మంత్రి కొండా సురేఖకు సీఎం రేవంత్ షాక్..!

హైదరాబాద్ ఆగస్టు 24(ప్రభాత గమనం): తెలంగాణలో పొలిటికల్ హీట్ మరింత పెరిగింది.పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది.ఆమె శాఖకు సంబంధించి ఇటీవల చేపట్టిన అధికారుల డిప్యూటేషన్లను ప్రభుత్వం సడన్‌గా రద్దు చేసింది.సంబంధిత శాఖ మంత్రికి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే.. ఈ నిర్ణయం తీసుకోవడం సచివాలయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలో అటవీ శాఖలో పలువురు అధికారులను వివిధ స్థానాలకు డిప్యూటేషన్‌పై పంపించారు. అయితే ముఖ్యమంత్రి కార్యాలయం జోక్యంతో ఈ డిప్యూటేషన్లు అన్నింటినీ ఉన్నపళంగా రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.సాధారణంగా మంత్రి ఆమోదం లేదా వారి దృష్టికి తీసుకెళ్లాకే నిర్ణయాలు జరుగుతుంటాయి. కానీ, సురేఖకు చెప్పకుండానే శాఖలో ఈ మార్పులు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.



# మల్లారెడ్డి మరణం బాదాకరం....

**– సిఎం రేవంత్ రెడ్డి....**

హైదరాబాద్ ఆగస్టు 24(ప్రభాత గమనం): రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడిన రైతు నాయకుడు, కమ్యూనిస్టు నేత సారంపల్లి మల్లారెడ్డి మరణించారని తెలిసి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రైతుల హక్కులు, వ్యవసాయ సమస్యల పరిష్కారం కోసం ముందుండి అనేక ఉద్యమాలు నడిపించారని గుర్తుచేశారు. రైతు సంఘం నేతగా, అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

భూమి హక్కులు, సాగునీరు, వ్యవసాయ రుణాలు, విత్తనాలు వంటి వ్యవసాయ రంగానికి సంబంధించిన విస్తృత అంశాలపై నిరంతరం కృషి చేస్తూ జీవితాన్ని రైతుల సంక్షేమం కోసం అంకితం చేసిన నాయకుడు మల్లారెడ్డని పేర్కొన్నారు.సారంపల్లి మల్లారెడ్డి ఆత్మకు



శాంతి చేకూరాలని ప్రార్థించారు. మల్లారెడ్డి కుటుంబ సభ్యులు, అభిమానులకు ముఖ్యమంత్రి సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.